ఎర్ర సముద్రం.. ముందుకొచ్చిందండి!





ఇటీవల విడుదలైన 'దేవర' సినిమా గుర్తుందా.. అందులో కథంతా ఎర్ర సముద్రం చుట్టూనే తిరుగుతుంది. ఆ ఎర్ర సముద్రం ఇప్పుడు మన ప్రాంతానికి వచ్చింది. ఇంతకీ ఎక్కడంటారా? కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్ ఓడరేవు వద్ద. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద పెద్దవాగు రూపంలో సముద్రంలో కలుస్తోంది. దీంతో నీలిసాగరం కాస్త ఎరుపు, లేత, ముదురు నీలం రంగుల్లో చూపరులను ఆకట్టుకుంటుంది. గట్టును తాకుతుండా అన్నట్లు తొలుత ఎర్రనీరు పలకరిస్తుంది. సందర్శకులు తమ చరవాణుల్లో క్లిక్‌మనిపిస్తున్నారు. - ఈనాడు, కాకినాడ

కలెక్టరేట్ వద్ద ధర్నా రేపు

గాంధీనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు నగర కన్వీనర్ పలివెల వీరబాబు తెలియజేశారు. ఉదయం 10గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నామన్నారు. ఇసుక సరఫరా లేక నిర్మాణరంగ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం, యంత్రాంగం స్పందించాలన్నారు.

వైకాపా పాపం.. ప్రగతికి శాపం

విడుదల కాని రూ.28.62 కోట్ల ఆర్థికసంఘం నిధులు

ఈనాడు, రాజమహేంద్రవరం: అయిదేళ్ల వైకాపా పాలనలో మహానగరాల నిర్లక్ష్యం నగర పాలక సంస్థలు, నగర పంచాయతీలకు గ్రహపాటుగా మారింది. ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సగం విడుదల చేసినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని సంస్థలకు రాలేదు.. తద్వారా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లు, ఏలేశ్వరం నగరపంచాయతీ వంటివి సుమారు రూ.28.62 కోట్ల మేర కోల్పోవాల్సి వచ్చింది.

పాలకవర్గాలు లేక..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 2014లో ఎన్నికలు జరగ్గా ఆ పాలక వర్గం 2019 వరకు కొనసాగింది. గడువు ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో ఉంది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో ఎన్నికల దిశగా అడుగులు వేసేందుకు కనీస కసరత్తు చేయలేదు. విలీన పంచాయతీలకు సంబంధించిన కొన్ని న్యాయపరమైన చిక్కులు పరిష్కరించడంలోనూ విఫలమే. సాధారణంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా ఏటా సుమారు రూ. 35 కోట్ల మేర నిధులు ఈ కార్పొరేషన్‌కు మంజూరవుతుంటాయి. మొదటి విడతలో రూ.17.5 కోట్లు అందరితో పాటు రావాల్సి ఉన్నా పాలక వర్గాలు లేక కేంద్రం విడుదల చేయలేదు.

■ కాకినాడ నగరపాలక సంస్థకు తెదేపా ప్రభుత్వ హయాంలో 2017లో ఎన్నికలు నిర్వహించగా ఆ పాలకవర్గం 2022 సెప్టెంబరు 15 వరకు కొనసాగింది. ఇక్కడ ఆరు గ్రామాల విలీనానికి సంబంధించి న్యాయపరమైన వివాదాలున్నాయి. వీటిని పరిష్కరించడంలో వైకాపా సర్కారు చొరవ చూపలేదు. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేక ఆర్థిక సంఘం నిధులు కేంద్రం మంజూరు చేయలేదు. ఇక్కడ సగటున ఏడాదికి సుమారు రూ.20 కోట్లు వస్తుంటాయి. ఈ విడతలో దాదాపు రూ.10 కోట్లు మంజూరవుతాయని భావించినా మొండి చేయే ఎదురైంది.



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం

ఆదాయ వనరులు పెంచుకోనందున...

ఏలేశ్వరం నగర పంచాయతీకి పాలకవర్గం ఉన్నా కేంద్ర నిబంధనల మేరకు ఆదాయాన్ని వృద్ధి చేసుకోవడంలో విఫలమైంది. దీంతో తొలివిడత విడుదలవ్వాల్సిన సుమారు రూ.1.12 కోట్లు రాలేదు. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే పాలకవర్గాలు ఉండాలి.. ఆయా స్థానిక సంస్థల ఆదాయం ఏటా 12.01 శాతం పెరుగుదల నమోదవ్వాలన్న నిబంధన ఉంది. ఇది ఏలేశ్వరానికి శరాఘాతంగా మారింది. ఏటా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తే అభివృద్ధి చేసుకునే అవకాశం ఉండేది. పంచాయతీకి 2022-23లో పన్నుల డిమాండ్ రూ.1.32 కోట్లు కాగా రూ.1.08 కోట్లు మాత్రమే వసూలైంది. 2023-24లో రూ.1.48 కోట్లకు రూ.1.18 కోట్లు మాత్రమే వసూలుచేయగలిగారు.

పారిశుద్ధ్యం, అభివృద్ధికి అవకాశం..

కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో 50 శాతం మేర పారిశుద్ధ్యం, కాలువల నిర్మాణం తదితర అవసరాలకు, మిగతా 50 శాతం నిధులతో సాధారణ, సుందరీకరణ పనులు చేసుకోవచ్చు. గత పాలకులకు కొరవడిన ముందుచూపు, విడుదల చేసిన నిధులు ఇతర అవసరాలకు మళ్లింపు వంటి వ్యవహారాలు సమస్యకు కారణమయ్యాయి.

అయిదేళ్ల నరకం

500 మీటర్ల మార్గం..

● ఆకర్షణీయ నగరంలో ఇదీ పరిస్థితి
● కూటమి ప్రభుత్వం చొరవ చూపితేనే మోక్షం

మార్గం: కాకినాడలోని సర్పవరం కూడలి- ఆర్టీవో కార్యాలయ కూడలి- పల్లంరాజునగర్- డెయిరీఫారం సెంటర్- పోర్టు రైల్వే లైను- జగన్నాథపురం వంతెనను కలిపే రహదారి

ఏమిటి విషయం: 14 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి గతంలో తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్మార్ట్ రోడ్డు సంజయ్‌నగర్‌లోని డంపింగ్ యార్డు వరకు సాగి మరో 500 మీటర్లు వేయాల్సి ఉండగా అక్కడితో ఆగిపోయింది.

ఏమైంది: కాకినాడ స్మార్ట్ సిటీలో రూ.100 కోట్లతో కీలక రహదారుల నిర్మాణంలో భాగంగా సర్పవరం కూడలి నుంచి జగన్నాథపురం వంతెనను అనుసంధానం చేసేలా నిర్మించాలన్నది ప్రణాళిక. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు మెయిన్ రోడ్డు, దేవాలయం వీధి, సినిమా రోడ్డు, వార్ఫ్ రోడ్డులలో ట్రాఫిక్ ఎక్కువైనప్పుడు, ప్రత్యేక పరిస్థితుల్లో ఇటు మళ్లించొచ్చు. వైకాపా పట్టించుకోక అయిదేళ్లుగా ఎదురుచూడాల్సి వచ్చింది.

సమస్య ఎక్కడుంది..?: అసంపూర్తిగా మిగిలిన 500 మీటర్లలో రహదారిని పూర్తిచేయాల్సిన భూమి రైల్వేది. ఆ శాఖ అనుమతి కావాలి. విన్నవించి.. మార్గం సుగమం చేసే చొరవ వైకాపా నాయకులు తీసుకోలేదు. ప్రస్తుతం కాకినాడ నగరపాలక సంస్థ డంపింగ్ యార్డు ఈ రోడ్డు పనులు ఆగిన స్థలంలోనే ఉంది.

అధునాతన మౌలిక వసతులు, ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తెచ్చేందుకు 2015లో ఎంపికైన ఆకర్ష నగరిలో కాకినాడ ఒకటి. రూ.1,005 కోట్లతో ఈ నగరానికి కొత్త శోభ తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగానే సర్పవరం కూడలి- జగన్నాథపురం వంతెన రోడ్డు వస్తాయి. రాజకీయ స్వప్రయోజనాల కోసం అడ్డుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటు స్మార్ట్‌సిటీ, అటు నగర పాలక సంస్థ అధికారులు తప్పించుకుంటున్నారు. ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, కాకినాడ నగరం



అర్ధాంతరంగా నిలిచిపోయిన స్మార్ట్‌సిటీ రహదారి



డంపింగ్ యార్డుకు వెళ్లే మార్గం దుస్థితి

బాధ్యత తీసుకుంటేనే మేలు..

కాకినాడ స్మార్ట్‌సిటీ పనుల కాలపరిమితి మరో నాలుగు నెలల్లో ముగియనుంది. ఈలోగా రోడ్డుకు మోక్షం దక్కితే మంచిదే. లేదంటే నగర పాలక సంస్థ బాధ్యతలు తీసుకోవాలి. అప్పుడే రాకపోకలకు అడ్డంకులు తొలగుతాయి. మార్గం అసంపూర్తిగా ఆపేసి.. వ్యర్థాలతో కప్పేయడంతో పోర్టు, జగన్నాథపురం వంతెన వైపు వెళ్లే ద్విచక్ర, ఇతర వాహనాలు లారీ యూనియన్ ప్రాంగణం మీదుగా అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది.

ఉద్దేశపూర్వకంగానే ఆపేశారు



తెదేపా అధికారంలో ఉన్నప్పుడు స్మార్ట్‌సిటీలో సర్పవరం జంక్షన్ నుంచి పోర్టు వరకు రోడ్డు నిర్మించాం. అప్పుడు మా ప్రభుత్వం మారడంతో అర కిలోమీటరు రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఉద్దేశపూర్వకంగానే దీనిని ఆపేశారు. వ్యర్థాలతో మూసేసి డంపింగ్ యార్డుగా మార్చేశారు. అక్కడి నుంచే గంజాయి అక్రమ వ్యాపారం చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేస్తే ఏడుగురిని పోలీసులు అరెస్టుచేశారు. రోడ్డు పరిశీలించాను. అడ్డుగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, వ్యర్థాలు తొలగించమని ఆదేశించాం. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

- వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు 30 ఏళ్లు

విజయవాడ: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవం నిర్వహించారు. కేక్ కోసి సంబరాలు నిర్వహించారు. ఈ రైలు 1994 అక్టోబరు 2న ప్రారంభమైంది. రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి అత్యాధునిక సౌకర్యాలు వచ్చాయి. రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడలో బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకుంటుంది. రోజూ 140శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసుకుంటుంది.

పాదగయలో దసరా ఉత్సవాలు

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో దసరా శరన్నవరాత్రులు, శత చండీయాగ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి ఈనెల 12 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. కుక్కుటేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి, పదో శక్తిపీఠం పురుహూతిక అమ్మవార్లకు వేద పండితుడు చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాజరాజేశ్వరి అమ్మవారు గురువారం రాజరాజేశ్వరిగా.. 4వ తేదీన బాలాత్రిపురసుందరి, 5న అన్నపూర్ణాదేవి, 6న గాయత్రీ దేవి, 7న లక్ష్మీదేవి, 8న కాళికా దేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న విజయదుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తారు. 12న శతచండీయాగం, మహాపూర్ణాహుతి నిర్వహిస్తారని ఈవో తెలిపారు.



పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్లు

21 మండలాలకు ఇద్దరే

విధుల్లో చేరని సీఎస్‌డీటీలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రేషన్ సరకుల పంపిణీ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. 420 ఎండీయూ వాహనాల ద్వారా 6.54 లక్షల కార్డులకు బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ప్రతీ కార్డుదారుడికి సకాలంలో అందించడంతో పాటు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది. కాకినాడ పోర్టు నుంచి పెద్దఎత్తున రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సరకుల పంపిణీ, అక్రమంగా తరలిపోకుండా నిఘా బాధ్యతలు పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ల(సీఎస్‌డీటీ)పై ఉంది. సాధారణ బదిలీల్లో భాగంగా వీరిని పూర్తిస్థాయిలో బదిలీ చేసి, కొత్త వారిని నియమించారు. మండలాల వారీగా సీఎస్‌డీటీలను నియమించి పదిరోజులు కావస్తున్నా ఇప్పటికీ 90 శాతం మంది విధుల్లో చేరలేదు.

11 పోస్టులు మాత్రమే మంజూరు..

కాకినాడ జిల్లాకు కేవలం 11 మంది సీఎస్‌డీటీ పోస్టులు మాత్రమే మంజూరు చేశారు. బదిలీల్లో వీటిని భర్తీ చేయగా కేవలం ఇద్దరు మాత్రమే విధుల్లో చేరారు. 9 మంది చేరలేదు. ఇప్పటి వరకు కేవలం 8 మంది సీఎస్‌డీటీలు మాత్రమే 21 మండలాల్లో పర్యవేక్షించేవారు. పూర్తిస్థాయిలో ఈ పోస్టులు భర్తీ చేయాలని, మండలానికి ఒకరు చొప్పున కేటాయించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కలెక్టర్‌కు లేఖ రాశారు. రెవెన్యూ శాఖలో ఉప తహసీల్దార్ల కొరత కారణంగా జిల్లాలో పౌరసరఫరాల శాఖకు మంజూరు చేసిన క్యాడర్ పోస్టులను మాత్రమే బదిలీల్లో భర్తీ చేశారు. ఆయా మండలాల్లో వీరిని నియమించినా ఇప్పటికీ విధుల్లో చేరలేదు. దీనికితోడు వీరికి ఇన్‌ఛార్జులుగా వేరే మండల బాధ్యతలు అప్పగించారు.



కాకినాడలో ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీ

సక్రమ పంపిణీకి అవసరం..

నిర్దేశిత తేదీలోగా పంపిణీ పూర్తి చేసేందుకు పర్యవేక్షణ అవసరం. కొందరు ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సరకులు అమ్మిన సొమ్మును డీలర్లకు జమ చేయట్లేదు. పంపిణీలో పలు సమస్యలు ఉన్నాయి. వీటిని సరిదిద్దాల్సిన సీఎస్‌డీటీలు విధుల్లో చేరడం ఎంతో కీలకం. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రతి గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుతాం

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ స్ఫూర్తితో జిల్లాలో ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ గ్రామీణం వాకలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్రీన్ అంబాసిడర్లుగా ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. 16 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో వనమహోత్సవం, స్వచ్ఛత, పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డీపీవో కె.భారతిసౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, ఎంపీడీవో కారే స్వప్న, పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, ఇతర అధికారులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వాకలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు

నేటినుంచి టెట్

జిల్లాలో నాలుగు కేంద్రాల్లో నిర్వహణ

మసీదు సెంటర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 21వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. రోజుకు రెండు పూటలుగా వీటిని నిర్వహించనున్నారు. రోజుకు రెండు సెషన్ల చొప్పున ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకూ జరుగుతాయి. పూర్తిగా ఆన్‌లైన్‌లో వీటిని నిర్వహిస్తారు. పరీక్షలకు ఒక గంట ముందు హాజరుకావాల్సి ఉంది. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కాకినాడ ఐయాన్, సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 21471 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. జిల్లాలో టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని డీఈవో పి.రమేష్ తెలిపారు.

ఖైదీల సంక్షేమ దినోత్సవం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కృషి, పట్టుదల, క్రమశిక్షణ, మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని కాకినాడ మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.కమలాదేవి పేర్కొన్నారు. కాకినాడ ప్రత్యేక సబ్‌జైలులో బుధవారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా న్యాయమూర్తి పి.కమలాదేవితో పాటు శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత శ్యామ్ హాజరయ్యారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఖైదీలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి న్యాయమూర్తి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, డిప్యూటీ జైలర్ జోసఫ్, జైలు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకినాడ మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి కమలాదేవి

శ్రీపీఠంలో మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి 13 వరకు మహాశక్తియాగం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. బుధవారం శ్రీపీఠం గోశాలలో మహాశక్తియాగం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తెలుగు రాష్ట్రాల నుంచి రోజూ 35 వేల మందికిపైగా మహిళా భక్తులు ఎరుపు వర్ణ ఏకరూప దుస్తులతో కుంకుమ పూజలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 10వ దుర్గాష్టమి రోజు అధిక సంఖ్యలో భక్తులు శ్రీలలిత సహస్రవిరాట్ పారాయణ, పూజలు చేస్తారన్నారు. 9న మూలా నక్షత్రం పురస్కరించుకుని సుమారు 24 వేల మంది విద్యార్థులు 3 కోట్ల మహాసరస్వతి అనుష్టానం పూజలు చేయడానికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. అమ్మవారికి రోజుకొక అలంకరణ, బగళాముఖి హోమాలు శాంతికర కల్యాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల్లో సుమారు 4 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేస్తామని చెప్పారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై మాట్లాడుతూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున ఎటువంటి వ్యాఖ్యలు చేయనని, కోర్టు తీర్పు వచ్చిన తర్వాత స్పందిస్తానని తెలిపారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిపూర్ణానందస్వామి

వరద ఉద్ధృతికి కాజ్‌వే ధ్వంసం

గొల్లప్రోలులో జగనన్న కాలనీకి వెళ్లే మార్గంలో సుద్దగెడ్డ వరద ఉద్ధృతికి కాజ్‌వే ధ్వంసమైంది. దీనిపై ఆరు రోజులపాటు వరద నీరు ప్రవహించింది. కాలనీ మార్గంలో కాజ్‌వేపై నీరు బుధవారం ఉదయం తొలగడంతో ఇలా ఛిద్రమై కనిపించింది. రాళ్లు లేచి, కాంక్రీటు పెచ్చులతో ఉన్న రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టడంతోపాటు ఈ ప్రాంతంలో వంతెన నిర్మించి వరద సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

తాచుపాము పట్టివేత

కాకినాడ రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో సంచరిస్తున్న ఓ తాచుపామును సిబ్బంది ఒకరు పట్టుకుని బంధించారు. సుమారు మూడు అడుగులు ఉన్న తాచుపాము కార్యాలయ ఆవరణలో రాత్రి సమయంలో తిరుగుతోంది. సిబ్బంది ఒకరు పాముకు ఎలాంటి హాని చేయకుండా కర్రసాయంతో ప్లాస్టిక్ డబ్బాలో చాకచక్యంగా బంధించారు. నగర శివారున జన సంచారం లేని ప్రదేశంలో విడిచిపెట్టారు.



-న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

బరువు కాదు.. భవిష్యత్తుపై బాధ్యత



తాళ్లరేవు మండలం చొల్లంగిపేట బాలికల గురుకుల పాఠశాలకు దసరా సెలవులిచ్చారు. విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు బుధవారం ఉదయాన్నే గురుకులానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు పిల్లల బ్యాగులు, పెట్టెలను నెత్తిపై పెట్టుకుని ఇంటికి బయలుదేరారు.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకం

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు పూర్వవైభవం

న్యూస్‌టుడే – తుని, తుని పట్టణం

దశాబ్దాలుగా విద్యాసంస్థల్లో అమల్లో ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం మళ్లీ కళకళలాడనుంది. ఏళ్లుగా మరుగున పడ్డ ఈ విభాగానికి కూటమి ప్రభుత్వంలో మళ్లీ జవసత్వాలు నింపాలని నిర్ణయించారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఉన్న అనేక ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో దీని అమలుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, డీఈవో చీఫ్ కమిషనర్‌గా ఉన్న కమిటీ జిల్లా స్కౌట్‌లో పలువురు సభ్యులు ఈ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు.

ఉన్నత పాఠశాలల్లో యూనిట్ల ఏర్పాటు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌జీసీ మాదిరిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఒక్కో యూనిట్‌లో 32 మంది విద్యార్థులు ఉంటారు.

- ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవిస్తే సహాయచర్యలపై శిక్షణ
- గ్రామాల్లో పండుగలు/జాతరల వేళ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం
- ఆపత్కాలంలో ప్రథమ చికిత్స చేసే పద్ధతులపై తర్ఫీదు
- పిల్లల్లో దేశభక్తి పెంపొందించే జెండా ఏ విధంగా కట్టాలి తదితరాలపై అవగాహన కల్పించడం
- తోటి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బంగారు భవితకు తోడ్పడేలా సహకారం


గైడ్స్ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయినులు, పీడీలు

శిక్షణతో ప్రయోజనాలివీ..

జిల్లాలో ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న పీఈటీ, పీడీలతోపాటు ఉపాధ్యాయులు ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ విభాగానికి 6వ తరగతి చదివే విద్యార్థులను ఎంపిక చేస్తారు. బాలురకు స్కౌట్, బాలికలకు గైడ్స్ విభాగాలు ఉంటాయి. వీరు రెండేళ్లపాటు శిక్షణ తీసుకుంటే ఆర్నెళ్లకోసారి నిర్వహించే రాత పరీక్ష ఫలితాల ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన్ ధ్రువపత్రాలు అందుతాయి. నాలుగో దశలో రాజపురస్కార్ పేరిట గవర్నర్ అవార్డు దక్కుతుంది. ఈ స్థాయికి చేరిన విద్యార్థులకు ఉన్నత విద్య, కేంద్రప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుంది. స్కౌట్ శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులను మాస్టర్ అని, గైడ్స్ విభాగం ఉపాధ్యాయులను కెప్టెన్ అంటారు.


స్కౌట్స్ శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, పీఈటీలు

రెండు విడతల్లో శిక్షణ

జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు రెండు విడతల్లో శిక్షణ పూర్తి చేశాం. ఇప్పటికి 170 మంది వరకూ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరి ద్వారా ఆయా పాఠశాలల్లో విద్యార్థులను ఎంపిక చేస్తాం. దీనిలో చేరి శిక్షణ పొందే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

- ఎంవివి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి, బిఎస్ఎస్‌పి జగదీష్, జిల్లా కోశాధికారి

అలరించిన యూటీఎఫ్ ఉపాధ్యాయుల 'రంగస్థలం'

కాకినాడ నగరం: స్థానిక సూర్యకళా మందిర్‌లో బుధవారం ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ రంగస్థలం-24' కార్యక్రమం అలరించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ మాట్లాడుతూ యూటీఎఫ్ కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా ఉపాధ్యాయుల్లో దాగిన కళలను కూడా వెలికితీస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ సంఘ స్వర్ణోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాలు, టీచర్స్ ఒలింపిక్స్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది ఉపాధ్యాయ కళాకారులు పాల్గొన్నారు. జానపద గీతాలు, దేశభక్తి గేయాలు, ఉద్యమ గీతాలు ఆలపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఉద్యమ గీతాన్ని ఆలపించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నారావు, పీఈటీ, పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంక జార్జి, జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజ్, సీఐటీయూ నగర శాఖ కార్యదర్శి పలివెల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం అందించాలి

యానాం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలోని మత్స్యకారులకు ఓఎన్జీసీ పరిహారం వర్తింపజేసేలా కృషి చేయాలని ఏపీ భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరినట్లు దిల్లీలో పనిచేస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ పురందేశ్వరిని విజయవాడలో కలిసినట్లు చెప్పారు. సముద్రంలో ఓఎన్జీసీ చేపట్టే కార్యకలాపాల వల్ల కాకినాడ రూరల్, సిటీ, పిఠాపురం, తుని ప్రాంతాల మత్స్యకారుల చేపల వేట ప్రభావితం అవుతోందన్నారు. వారికీ పరిహారం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చానన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు డీజిల్ రాయితీ పెంచాలన్నారు. ఓబీసీ కుల గణన విషయంలో తెలంగాణ తరహాలోనే ఏపీలోనూ జనాభా లెక్కల సేకరణ జరపాలని కోరారు.

మహాలయ అమావాస్య.. పిండ ప్రదానాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: మహాలయ అమావాస్య కావడంతో బుధవారం తెల్లవారుజాము నుంచే పితృ దేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించేందుకు పిఠాపురం పాదగయ క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. హోటళ్లు సైతం నిండుకున్నాయి. మొత్తం 2,500 మంది పిండ ప్రదానాలు చేశారు. పాదగయ కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు రంగంలోకి దిగి నియంత్రించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు రాజకీయ నాయకులు పిండ ప్రదానాలు చేశారు. దర్శనాలు, సేవలు, ప్రసాదాలు, అన్న ప్రసాద విరాళాలు, వసతి, పిండ ప్రదాన టిక్కెట్ల రూపంలో రూ. 5,89,029 ఆదాయం సమకూరిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.


పాదగయలో..

'విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి'

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, సొంత ఘనులు కేటాయించాలని కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. ఎమ్మెల్సీ ఐవీ ముందుగా గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించి, దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలో ఉత్పాదకత ఉండదని, సామర్థ్యం మేరకు ఉద్యోగులు పని చేయాలని ప్రచారం చేస్తున్న కార్పొరేట్, బూర్జువా మేధావులు విశాఖ ఉక్కులో తయారవుతున్న నాణ్యమైన ఇనుమును గుర్తించుకోవాలన్నారు. ప్రైవేటు పరిశ్రమలు ఇవ్వలేకపోతున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడిన కూటమి నేతలు ఇప్పుడు ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు బలవంతంగా బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంపదతో నిర్మించిన, త్యాగాలతో సాధించుకున్న విశాఖకు ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా నష్టాలు వస్తున్నాయనడం సమంజసం కాదన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులు తోకల ప్రసాద్, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ, గుబ్బల ఆదినారాయణ, ఎరుబండి చంద్రావతి, దూసర్లపూడి రమణరాజు, ఎస్. అప్పారావు తదితరులు కూర్చున్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జియో టెక్నికల్ ఇంజినీరింగ్ పితామహుడు కార్ల్ టెర్జాగి జీవితం ఆదర్శనీయమని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో బుధవారం జియోటెక్నికల్ ఇంజినీరింగ్ పితామహుడు కార్ల్‌టెర్జాగి జయంతిని పురస్కరించుకుని ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. యూసీఈకే సివిల్ ఇంజినీరింగ్, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ (ఐఎన్‌జి)కాకినాడ చాప్టర్, అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఏసీసీఈ) కాకినాడ చాప్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ హాజరై మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో వాతావరణానికి అనుగుణంగా చాలా నేలల స్వభావంలో మార్పులు వస్తున్నాయన్నారు. సివిల్ ఇంజినీర్లు వీటిని దృష్టిలో పెట్టుకుని తమ పరిశోధనలు చేయాలన్నారు. ప్రొఫెసర్ బీఆర్.ఫణికుమార్, ఏసీసీఈ కాకినాడ చాప్టర్ ఛైర్మన్ బాదం సుందరరావులు నేలల స్వభావం, సంభవిస్తున్న మార్పులు, జాగ్రత్తలు వివరించారు. రెక్టార్ కేవీ.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎన్. మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్స్, ఐజిఎస్ కాకినాడ ఛాపర్ట్ గౌరవాధ్యక్షుడు, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.


కార్ల్ టెర్జాగి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీసీ తదితరులు


క్రీడాకారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఏఎస్ఎన్ మూర్తి

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

97 పాఠశాలల నుంచి 1400 మంది హాజరు

రాజానగరం, తుని, న్యూస్‌టుడే: రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈనెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ క్లస్టర్ -7 పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని 97 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 135 వాలీబాల్ జట్లు, సుమారు 1400 మంది క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 30 మంది హాజరవుతున్నారు. పోటీల పర్యవేక్షణకు సీబీఎస్ఈ దిల్లీ నుంచి పరిశీలకుడు వస్తున్నారు. ఈ మేరకు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్.విజయప్రకాష్ బుధవారం మాట్లాడుతూ అతిథులందరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. ప్రిన్సిపల్ ఏఎస్ఎన్ మూర్తి, క్రీడల సమన్వయకర్త గంగాధర్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు దిశా నిర్దేశం చేశారు.

ఆట, నడక దేనికైనా రుసుములే..!

వైకాపా హయాంలోనే ఆదేశాలు.. ఇప్పుడు అమల్లోకి..?

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజా క్రీడామైదానంలో క్రీడలు ఆడుకునేవారు, వాకర్లు రుసుం చెల్లించాలని సిబ్బంది చెబుతుండటం చర్చనీయాంశమైంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో విడుదలైన ఉత్తర్వులను తొక్కిపెట్టిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు తాజాగా వసూలు చేయడానికి సన్నాహాలు చేస్తుండటంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా వేల మంది ఈ క్రీడామైదానంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో వంటి అనేక క్రీడలు ఆడి, శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. మైదానంలో పలు రకాల క్రీడల శిక్షణకు నిర్ణయించిన రుసుంపై 2021 ఏప్రిల్ 1నే అధికారులు ఆదేశాలిచ్చారు. గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం 11 రకాల క్రీడా అంశాలకు సంబంధించి ప్రవేశం, నెలవారీ రుసుము చెల్లించాలని ఆదేశాల్లో అధికారులు పేర్కొన్నారు. దీన్లో ప్రధానంగా క్రికెట్‌లో శిక్షణ పొందే క్రీడాకారులు రూ. 500 ప్రవేశానికి, రూ. 200 నెలవారీ, అదే షటిల్ బ్యాడ్మింటన్‌కు అయితే ప్రవేశానికి రూ. రెండు వేలు, నెలకు రూ. 700 చెల్లించాలని చెబుతున్నారు. చివరకు క్రీడామైదానంలో వాకింగ్ చేయాలన్నా నెలకు రూ. 100గా నిర్ణయించారు.


తుని రాజా క్రీడామైదానం

నిర్వహణ నిమిత్తమే రుసుం

కోచ్‌లు లేకపోవడంతో రుసుం వసూలు చేయలేదు. రుసుం వసూలు చేయకపోతే మైదానం నిర్వహణ కష్టమవుతుంది. క్రీడాకారులు ఆడుకోవడానికి రుసుములు చెల్లిస్తామంటే కోచ్‌లను నియమిస్తాం.

- శ్రీనివాస్ కుమార్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి

విత్తన బంతులు.. పచ్చని కాంతులు

తాళ్లరేవు వాసవీ క్లబ్ కపుల్స్, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక వాసవీ మాత మందిరంలో బుధవారం మట్టితో విత్తన బంతులను తయారు చేశారు. ఇక్కడ సిద్ధం చేసిన 12వేల బంతులను రహదారులకు ఇరువైపులా వేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి అద్దేపల్లి సుధ, దాసరి భారతి, గోకవరపు శ్రీదేవి తెలిపారు. అందులో రావి, వేప, నేరేడు, సపోటా విత్తనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వర్షాలు పడినప్పుడు అవి మొలకెత్తి పచ్చదనం పెంపొందడానికి తోడ్పడతాయన్నారు. సామా ప్రకాష్, గోకవరపు సుభాష్, అద్దేపల్లి సత్తిరాజు, పేకేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సీడ్ బాల్స్‌ను తయారు చేస్తున్న వాసవీ సభ్యులు

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

వైజాగ్ కిమ్స్‌లో రోగికి పింఛను అందజేత

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ వైజాగ్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెన్న లక్ష్మీదేవికి సచివాలయ సిబ్బంది పింఛను అందజేశారు. మండలంలోని కాట్రావులపల్లికి చెందిన లక్ష్మీదేవి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నారు. గ్రామ తెదేపా నాయకుడు మునిరెడ్డి నాగేశ్వరరావు అభ్యర్థన మేరకు మహిళా పోలీసు సురేఖ వైజాగ్ వెళ్లి రూ. 10వేలు పింఛను అందజేశారు. బాధితురాలి బంధువులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


ఆసుపత్రిలో రోగికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

లారీని ఢీకొట్టిన మరో లారీ..డ్రైవర్ మృతి

తొండంగి: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక వెళ్తున్న మరో లారీ ఢీ కొట్టడంతో ఆ డ్రైవర్ మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. కాకినాడ జిల్లా కత్తిపూడి - విశాఖపట్నం వెళ్తున్న లారీ ఎన్‌హెచ్‌పై బెండపూడి సమీపంలో ఆగి ఉంది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ (అదే మార్గంలో) బుధవారం తెల్లవారుజామున ఢీకొట్టింది. దీంతో ఆ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని తుని ప్రాంతీయ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునిది పార్వతీపురం మన్యం జిల్లా మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన బలుసు వెంకటరమణగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

ఖైదీల్లో పరివర్తన రావాలి

దానవాయిపేట (రాజమహేంద్రవరం): కారాగారాల్లోని ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చే దిశగా జైలు అధికారులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం కారాగారంలోని మహిళా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తొలుత బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జైలులో మహిళా ఖైదీలకు అందుతోన్న వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు నిర్వహించిన ఆటపాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఖైదీల పిల్లలకు బొమ్మలు, దుస్తులు, పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా జైలు ఆశ్రమ వాతావరణంలో ఉన్నట్లు ఉందన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదల విషయాల్లో సిఫార్సు చేస్తామని తెలిపారు. ఖైదీల సమస్యలు, వారి కేసులు వివరాలు డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకు రావాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, అధికారులు విజయకుమారి, డాక్టర్ లక్ష్మి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.


ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

శిక్షణతో జైళ్ల శాఖకు ఆదాయం

కేంద్ర కారాగారాల్లో వృత్తివిద్యా శిక్షణ పొందడం ఖైదీలకు ఆర్థిక భరోసాగా ఉంటుందని గంధం సునీత అన్నారు. పురుషుల జైలులో నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందడం ద్వారా ఖైదీలు బయటకు వెళ్లిన తరవాత జీవనోపాధి మార్గం లభిస్తుందన్నారు. జైళ్ల శాఖలకూ ఆదాయం సమకూరుతుందన్నారు. ఇటీవల పలు కోర్టులకు సంబంధించి రూ. 60 లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను జైళ్లశాఖ ద్వారా కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆర్. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్ట్	200-00
స్కిన్‌లెస్	228-00

కొడవలి పుష్కర కాలువలో బాలుడి గల్లంతు

గొల్లప్రోలు: కొడవలి శివారు పుష్కర కాలువలో అదే గ్రామానికి చెందిన ముప్పన బోయిన సతీష్ (15) బుధవారం గల్లంతైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. తాటిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సతీష్ ఉదయం బహిర్భూమికి పుష్కర కాలువ దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెదికారు. కాలువలో సతీష్ పాదరక్షలు కనిపించడంతో ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతైనట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎన్.రామకృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకుని, ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి తండ్రి వీరవెంకట సత్యనారాయణ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


కాలువలో గాలిస్తున్న ఈతగాళ్లు (అంతరచిత్రం) సతీష్ (పాత చిత్రం)

మెట్టలో పిడుగుల వాన

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి: మెట్టప్రాంతంలో బుధవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి తోడు పలుచోట్ల పిడుగులు పడి బెంబేలెత్తించాయి. మండలాల్లో పిడుగుపాటుకు కొబ్బరి చెట్లు నిలువెల్లా కాలిపోయాయి. ఏలేశ్వరం మండలం లింగవరం కాలనీ హైస్కూల్ వెనుక వీధిలో, ప్రత్తిపాడును ఆనుకుని ఉన్న కొండలపైన పిడుగులు పడ్డాయి. రోజంతా తీవ్రంగా ఎండ కాయగా, రాత్రి ఏడు గంటల నుంచి రెండు గంటలపాటు ఆకాశానికి చిల్లుపడినట్లుగా వర్షం కురిసింది. విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. ప్రత్తిపాడు సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. మరమ్మతులు చేసేందుకు వాతావరణం సవాల్‌గా నిలిచింది. మెరుపుల వెలుతురులు, వానహోరు రెండు గంటల పాటు కొనసాగడంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది.


కిర్లంపూడి మండలం చిల్లంగిలో ఇళ్ల సమీపాన కొబ్బరి చెట్టుపై పిడుగు

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా - 36, వంకాయలు - 38,40,52, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 28,32, కాకరకాయ - 36, బీర - 40,46, కాలీఫ్లవర్ - 20, 25, క్యాబేజీ - 30, క్యారెట్ - 42, దొండకాయలు - 44, బంగాళదుంపలు - 30,36, ఉల్లి - 51,55, గోరుచిక్కుడు - 30, దోసకాయలు - 30, ఆనపకాయ - 25,30, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుడు - 50, చేమదుంపలు - 30,36, మునగకాయలు - 12,15, బీట్‌రూట్ - 34, కీరదోస - 28, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 68, బొబ్బర్లు - 50, చిలకడదుంపలు - 45, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,48.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, దేవి మల్టీప్లెక్స్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, 35, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- దేవర పార్ట్ 1, తిరుమల - దేవర పార్ట్ 1, సిటీసెంటర్ 1- మత్తువదలరా 2, సిటీ సెంటర్ 2- దేవర పార్ట్ 1, శ్రీప్రియ - ఆయ్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి)- దేవర పార్ట్ 1, సూర్య 2- దేవర పార్ట్ 1, శ్రీశ్రీనివాసా(వేలంగి)- దేవర పార్ట్ 1.

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం


సంతచెరువు కనకదుర్గ ఆలయం వద్ద..


పెద్ద శివాలయం వద్ద చలువ పందిళ్లు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. నగరంలోని ప్రముఖ ఆలయాలు, అమ్మవారి దేవాలయాలను శోభాయమానంగా అలంకరిస్తున్నారు. విద్యుత్తు దీపాలు, దేవతామూర్తుల చిత్రాలతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతిరోజూ రుద్రాభిషేకం, చండీహోమం, నవావరణార్చన, కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. సంతచెరువు కనకదుర్గ ఆలయం వద్ద భారీ సెట్టింగ్ వేశారు. జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద కనకదుర్గ ఆలయం, దేవాలయం వీధిలోని పెద్ద శివాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారి అవతార అలంకరణలు, పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. రామారావుపేట, భానుగుడి సెంటర్, సూర్యనారాయణపురం, కొండయ్యపాలెం, శ్రీనగర్, సినిమారోడ్డు, సాంబమూర్తినగర్, డైరీఫారం సెంటర్ తదితర ప్రాంతాల్లో దసరా ఉత్సవాలకు ముస్తాబు చేశారు. భానుగుడి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ పర్సన్ ఇన్‌ఛార్జి గోపాలకృష్ణ వివరించారు. సంతచెరువు కామాక్షి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అరట్లకట్ల రాంబాబు, చెల్లూరి సత్యనారాయణలు వివరించారు. - న్యూస్‌టుడే, గాంధీనగర్


బాలాత్రిపుర సుందరి ఆలయం లోపల ఏర్పాట్లు


బాలాత్రిపుర సుందరి ఆలయం వద్ద సెట్టింగ్

ఇదేనా స్వచ్ఛత.. సారూ



కేంద్రం పిలుపుతో గత నెల 17 నుంచి ఈనెల 2న గాంధీజీ జయంతి వరకు అంతటా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ, నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు, పారిశ్రామిక వాడల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పలుచోట్ల జరుగుతున్నా జిల్లా పరిపాలనా కేంద్రం కలెక్టరేట్‌లో మాత్రం కనిపించట్లేదు. ముగింపు రోజైన బుధవారం కలెక్టరేట్‌లో ఎక్కడా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టలేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. కలెక్టరేట్‌లోనే ఇలా ఉంటే మిగతా చోట పరిస్థితి ఏంటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

స్పందించారు.. శుభ్రం చేశారు



గాంధీనగర్: నగరంలో ప్రముఖ ఆలయమైన సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగా కోనేరు వ్యర్థాలతో నిండిపోయింది. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పవిత్రమైన ఆలయం ఎదురుగా కోనేరు, మద్యం సీసాలతో ఉండటంపై గత నెల 30న 'ఇవేనా..శుభ్రత వరమయ్యా..' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) కోనేరు శుభ్రం చేయాలని నగరపాలక సంస్థ, దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ సిబ్బంది కోనేటిలో చెత్త, మద్యం సీసాలను తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. బుధవారం ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి పర్యవేక్షణలో చేశారు. భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కోనేటి చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తేవాలని నగర వాసులు కోరుతున్నారు.

శాస్త్రి జీవితం దేశ ప్రగతికి నిలువుటద్దం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జీవితం దేశ ప్రగతికి నిలువుటద్దం అని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జగన్నాథపురం విష్ణాలయం వీధిలో బుధవారం శాస్త్రి జయంతి నిర్వహించారు. సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కమిటీ నాయకులు శర్మ, శాస్త్రి, మూర్తి, దీక్షితుల, సాయి తదితరులు పాల్గొన్నారు.

15 మంది వాహనదారులకు జరిమానా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు సారథ్యంలో నగరంలో వాహనదారులకు జరిమానాలు విధించారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా బండి నడుపుతున్న 15 మందికి బుధవారం జరిమానాలు విధించి, ట్రాఫిక్ సీఐలు కౌన్సిలింగ్ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించాలని, ముగ్గురు ప్రయాణించకూడదని, స్టంట్స్ చేయరాదని, మైనర్లు నడపకూడదని వివరించారు. ట్రాఫిక్-1, 2 సీఐలు ఎన్.రమేష్, డి..రామారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘స్వచ్ఛ కాకినాడ’ అందరి లక్ష్యం


ర్యాలీలో ఎమ్మెల్యే కొండబాబు, కమిషనర్ భావన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత అందరూ పాటించాలని, స్వచ్ఛ కాకినాడ మనందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా బుధవారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వివేకానంద పార్కు నుంచి మెక్లారిన్ ఉన్నత పాఠశాల వరకు స్వచ్ఛతా ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కొండబాబు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రజలు, వార్డు సచివాలయ సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, సీసీలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను డ్రోను సాయంతో ఎగురవేశారు. మున్సిపల్ కమిషనర్ భావన మాట్లాడుతూ కాకినాడ నగరం స్వచ్ఛత విషయంలో 2021లో దేశంలో రెండోస్థానంలో నిలిచిందన్నారు. ఒకటో స్థానానికి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. మెరుగైన సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. రెయిన్‌కోట్లు, పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ మనోహర్, పర్యవేక్షక ఇంజినీరు పి.సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్, టీపీఆర్వో కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

మసీదు సెంటర్: పాఠశాల సమాఖ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 విభాగాల్లో ఖోఖో జట్ల ఎంపికల్లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఏఆర్‌కేవీ ప్రేమజ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సీహెచ్ కౌశల్(అండర్-14), టీఎస్‌వీఎస్ సాయి మణికంఠ(అండర్-17), కె.చినసత్యం ఏలియా(అండర్-19) ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర పోటీల్లో పాల్గొనడానికి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పీడీ కె.పట్టాభిరామమ్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఉపాధ్యాయురాలు జయశీల, డేవిడ్, తాడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నగర దారులు.. నరకానికి నకళ్లు

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం


ఆర్టీవో కార్యాలయ కూడలి నుంచి నాగమల్లి జంక్షన్ రోడ్డు దుస్థితి


కోకిలా సెంటర్ నుంచి ఆదిత్య కళాశాల మార్గం

వరుస వర్షాలు నగర రోడ్లకు నష్టాన్ని తెచ్చిపెట్టాయి. జులై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు కొన్ని రోడ్లు దెబ్బతినగా పలుచోట్ల మరమ్మతులు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావం కూడా ఎక్కువగా ఉంది. కాకినాడ నగరంలో చిన్నా, పెద్దా కలిపి 300 కి.మీ. మేర రహదారులు ఉన్నాయి. ప్రధాన రోడ్లు 100 కి.మీ. వరకు ఉంటాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాల్లో గోతులు పూడ్చినా పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని అధికారులు వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రధానంగా ఎక్కడెక్కడంటే..

కోకిలా సెంటర్ నుంచి ఆదిత్య కళాశాల వైపు వెళ్లే రోడ్డు. ఈ మార్గంలో కాకినాడ నుంచి విశాఖకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తాయి. కళాశాల బస్సులు సైతం ఎక్కువగానే తిరుగుతాయి. ఈ రోడ్డులో శ్రీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఉంది.

✦ ఆర్టీవో కార్యాలయ కూడలి నుంచి నాగమల్లి జంక్షన్ పిఠాపురం రోడ్డు వరకు గల ప్రధాన దారి. ఈ మార్గంలో పెద్ద గోతులు ఉన్నాయి. దీంతో హెచ్చరిక సూచికలు పెట్టాల్సి వచ్చింది. ఆర్టీవో కార్యాలయం, గృహ నిర్మాణ, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ, సహకార, డీపీవో తదితర శాఖల కార్యాలయాలు ఇదే దారిలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది.

✦ సురేష్ చికెన్ సెంటర్ నుంచి భాస్కర్ నగర్ వెళ్లే రహదారిదీ ఇదే దుస్థితి. ఇటీవల ఆ గుంతలు పూడ్చినా ఈమధ్య కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. ✦ ఇంద్రపాలెం నుంచి బాలాజీ కూడలి వరకు ర.భ.శాఖ రోడ్డులో అనేక చోట్ల గోతులు పడ్డాయి. వీటిలో కొన్ని ఇటీవలే పూడ్చారు. పలుచోట్ల ప్రమాదకరంగా ఉంది. ✦ పులే విగ్రహం నుంచి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి వెళ్లే మార్గానిదీ ఇదే పరిస్థితి. ఇటువైపు పీఆర్ కళాశాల ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

సేవలకు సత్కారం


డీఈఈ సుబ్బారావు దంపతులకు సత్కారం

కాకినాడ కలెక్టరేట్: నగర ప్రజలకు ఉద్యోగులుగా అందించిన సేవలు చిరస్థాయిగా గుర్తుంటాయని నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీరు పి.సత్యకుమారి అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నగరపాలక సంస్థ డీఈఈ బీహెచ్ సుబ్బారావు, ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ పి.నారాయణవర్మకు బుధవారం స్థానిక స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీఈఈ సుబ్బారావు చేసిన సేవలను కొనియాడారు. నగరాభివృద్ధిలో ఆయన ప్రధాన భూమిక పోషించారని చెప్పారు. అనంతరం సుబ్బారావు, నారాయణవర్మ దంపతులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యనిర్వాహక ఇంజినీర్లు పి.వెంకటరావు, మాధవి, ఎంహెచ్‌వో డి.పృథ్వీచరణ్, డీఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడకు చెందిన ఆల్‌ఈజ్‌వెల్ సంస్థకు ఉత్తమ సేవా సంస్థ పురస్కారం లభించింది. గాంధీ జయంతి సందర్భంగా మెక్లారిన్ హైస్కూలు గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. నగరంలో పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న ఆల్‌ఈజ్‌వెల్ స్వచ్ఛంద సంస్థను ఉత్తమ సేవా సంస్థగా గుర్తించారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), కమిషనర్ భావన చేతులమీదుగా సంస్థ ఉపాధ్యక్షుడు డా.రాజ్‌కుమార్‌ను సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు.

ఆక్రమణలు ఇలా.. మురుగు తీసేదెలా..?



కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని కాలనీల్లో కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కాలువలపై కారు షెడ్లు, ప్రహరీలు, మెట్లు వంటివి నిర్మించుకుంటున్నారు. కాలువలు శుభ్రం చేయలేక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల మొక్కల పెంపకం నెపంతో ఇనుప గ్రిల్‌లు ఏర్పాటు చేసి, కాలువలు పూర్తిగా మూసేస్తున్నారు. డ్రెయిన్లు శుభ్రం చేయాలంటే పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బందికరంగా మారుతోంది. వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంటోంది. గాంధీనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ రహదారి, అయోధ్యనగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూకాలనీ, రామారావుపేట తదితర ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

మహిళలకు చీరల పంపిణీ



కాకినాడ నగరం: మహనీయులు చూపిన బాటలో పయనించాలని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు అన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 100 మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 300 మందికి అన్నదానం చేశారు. సుబ్బు, ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి ప్రతినిధులు సాయిరామ్ వర్మ, బత్తుల సూర్యప్రసాద్, కలసాని సాయిలక్ష్మణ్, పల్లపోతు వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి ఆదర్శం గాంధీ మార్గం


గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జేసీ, శిక్షణ కలెక్టర్, డీఆర్వో


స్వచ్ఛతాహీ సేవలో జేఎన్‌టీయూకే అధికారులు, వాలంటీర్లు, విద్యార్థులు


రక్తదానం చేస్తున్న భాజపా నాయకులు

కాకినాడ కలెక్టరేట్, గాంధీనగర్, మసీదు సెంటర్: సత్యం, అహింస అస్త్రాలుగా అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు గాంధీజీ అని కలెక్టర్ షాన్‌మోహన్ కొనియాడారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి కలెక్టర్, జేసీ రాహుల్‌మీనా, శిక్షణ కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, డీఆర్వో డి.తిప్పేనాయక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీజీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి నివాళులర్పించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ✦ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీజీవో సంఘ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి వేపకాయల వెంకటకృష్ణ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ✦ జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన తోట సుధీర్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో తలాటం సత్య, ఆకుల శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ✦ మహాత్మాగాంధీ సిద్ధాంతాలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కెవిఎస్‌జి.మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి నిర్వహించారు. రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, డైరక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. ✦ గాంధీభవన్‌లోని కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ షాన్‌మోహన్ విచ్చేశారు. గాంధీభవన్ వ్యవస్థాపకులు కొమండూరి శఠగోపాలాచార్యులు, తనికెళ్ల సత్యనారాయణమూర్తిల కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రాంగణంలోని బెంగళూరుకు చెందిన ప్రభల సుబ్బారావు ఉన్నతి సంస్థ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. గాంధీ భవన్ కార్యక్రమాలను ప్రశంసించారు. వివిధ పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గాంధీభవన్ అధ్యక్షుడు విఎల్.గాంధీ, కార్యదర్శి వైవిఎస్.మూర్తి, ప్రభల సుబ్బారావు, రాయవరపు ఆదినారాయణరావు, వక్కలంక రామకృష్ణ, డాక్టర్ కాద వెంకటరమణ, అల్లూరి సురేంద్ర భారతలక్ష్మి, వై.డి.రామారావు డాక్టర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ✦ భాజపా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొడ్డి వీరేంద్ర, సౌత్ మండలాధ్యక్షుడు చెక్క రమేష్‌ల ఆధ్వర్యంలో రాగంపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు గట్టి సత్యనారాయణ పైడా భవన ప్రసాద్, యెనిమిరెడ్డి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. ✦ గాంధీనగర్ పార్కులోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వనమాడి నివాళులర్పించారు. ✦ లయన్స్‌క్లబ్ రీజినల్ ఛైర్‌పర్సన్ పద్మతులసి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, ఫాస్ట్ గవర్నర్ బాదం బాలకృష్ణ, ఎం.విశ్వేశ్వరరావులు అతిథులుగా హాజరయ్యారు.


లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

‘ఫ్రీ ఫ్లెక్సీ సిటీ’ అమలుకు డిమాండ్

మసీదు సెంటర్: కాకినాడలోని భానుగుడి నుంచి కలెక్టరేట్, టుటౌన్ నుంచి జగన్నాథపురం, వన్‌టౌన్ నుంచి సినిమారోడ్డు మీదుగా కలెక్టరేట్ బంగ్లా వరకూ ఫ్రీ ఫ్లెక్సీ రోడ్డు అమలు చేయాలని సామాజిక వేత్త, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. నగరపాలక సంస్థ ప్లానింగ్ విభాగం తీవ్ర నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందన్నారు. దేవుళ్లను రాజకీయ ప్రచారంలోకి లాగదన్నారు.

పేదలకు దుస్తుల అందజేత

మసీదుసెంటర్: హింసను విడనాడి అహింస వైపు పయనించాలని లైన్స్ పశ్చిమగోదావరి జిల్లా మాజీ గవర్నర్ బాబుజీ రావు అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని కాకినాడ సఖి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక విముక్తి కాలనీలో పలు కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. క్లబ్ సభ్యులు నాగలక్ష్మి, రమణి, సావిత్రి, అన్నపూర్ణ, స్వప్న, మంగా వెంకట శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటం


జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిద్దామని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కేఎస్.శ్రీనివాసు అన్నారు. బుధవారం కచేరిపేటలోని సుందరయ్యభవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుక జరిగింది. జిల్లా అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. కౌలురైతు సంఘ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కేఎస్.శ్రీనివాసు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా దళితులపై కులవివక్ష, అసమానతలు, అంటరానితనం, దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన పోరాట లక్ష్యాలతో రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి సింహాచలం, సభ్యులు పద్మనాభం, రాజు, రవికుమార్, ప్రసాద్, శ్రీను, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

‘మద్యం అమ్మకాలు పెంచే విధానం తగదు’

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మద్యం అమ్మకాలు పెంచే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ నక్కా సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని, గొలుసు దుకాణాలు రద్దు చేయాలని, గుడి, బడి, బస్టాండు, రైల్వేస్టేషన్లు, రద్దీ కూడళ్ల వద్ద మద్యం దుకాణాలు అనుమతించకూడదన్నారు. మద్యానికి బానిసైన వారికి డీ-ఎడిక్షన్ కేంద్రాల ద్వారా చికిత్స అందించాలని, ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ఒక కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తాగుడు కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల్లో మహిళలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మద్యం అమ్మకాలు, దుకాణాలు తగ్గించేలా ఎక్సైజ్ విధానం రూపొందించాలన్నారు. కొమ్ము చినబాబు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి కవిత్వం.. ప్రజాపక్షం


జ్ఞాపికలు అందుకున్న విద్యార్థినులు

అద్దేపల్లి కవిత్వం ఎల్లప్పుడూ ప్రజాపక్షమేనని సాహిత్య ప్రపూర్ణ డా.కె.జి.వేణు అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ‘ఆకాశాన్ని హత్తుకున్న అద్దేపల్లి కవిత్వం’ అనే అంశంపై సాహిత్య సదస్సు జరిగింది. అరసం జిల్లా అధ్యక్షుడు పత్సమట్ల సుబ్బరాజు అధ్యక్షత వహించారు. వేణు ప్రధానోపన్యాసం చేశారు. అద్దేపల్లి కవిత్వంలో ప్రతీ పదం ప్రజాపక్షమేనన్నారు. శ్రమజీవులు, అణగారిన వర్గాలు, పేదల గొంతుక అద్దేపల్లి అన్నారు. ముఖ్య అతిథి జి.వెంకటకృష్ణ మాట్లాడుతూ అద్దేపల్లి రచనల్లో అనేక నూతన ప్రయోగాలు చేరాయన్నారు. మినీ కవిత్వానికి ప్రాణం పోశారన్నారు. కవులు శిరీష, డా.వేదుల శ్రీరామశర్మ, పి.పద్మజవాణి, అద్దేపల్లి జ్యోతి, గనారా, గౌరీనాయుడు, చింతపల్లి సుబ్బారావు, పోచినపెద్ది, సోమయాజులు, భరతలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, కవితా పోటీల్లో విజేతలకు అరసం తరఫున ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. – న్యూస్‌టుడే, కాకినాడ నగరం

న్యాయవాదుల రక్తదానం



మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ బార్ అసోసియేషన్ భవనంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విశ్వేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాకినాడ మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.కమలాదేవి, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.హరినారాయణ తదితరులు హాజరయ్యారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని న్యాయమూర్తులు ప్రారంభించారు. అధిక సంఖ్యలో న్యాయవాదులు రక్తదానం చేశారు. స్టేట్ బార్ అసోసియేషన్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

కాకినాడ నగరం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని శ్రీసాయి రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామారావుపేటలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. గైనిక్, మధుమేహ, థైరాయిడ్, చెవి, ముక్కు, గొంతు తదితర వ్యాధులకు సంబంధించి 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు డా.కొండమూరి సత్యనారాయణ, డా.బీమల దుర్గాప్రసాద్, డా.లక్ష్మణ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

పిఠాపురం: పి.దొంతమూరు సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటు, మరమ్మతుల కారణంగా పి.దొంతమూరు, వెల్దుర్తి గ్రామాల్లో ఇళ్లకు, వ్యవసాయ బోర్లకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల సభ 5న

పెదపూడి, న్యూస్‌టుడే: కాకినాడలో ఈ నెల 5న నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య సభను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు.

వన్యప్రాణుల సంరక్షణే లక్ష్యం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రంలో వన్యప్రాణుల వారోత్సవాలను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ బుధవారం ప్రారంభించారు. పర్యాటక కేంద్రానికి విచ్చేసిన పర్యాటకులకు వన్యప్రాణుల విశిష్టతను ఫారెస్ట్ సెక్షన్, బీట్ అధికారులు వివరించారు.


పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

నురగ నీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలన


కొళాయి నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు నురగ నీరు సరఫరా అవుతోందని ఈనాడులో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుధవారం ప్రచురితమైన 'కొళాయిల్లో నురగనీరు' కథనానికి పురపాలక సంఘ కమిషనర్ శ్రీవిద్య స్పందించి స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాల సమీపంలో ఇంటింటికీ వెళ్లి నీటిని పరిశీలించారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి నమూనాలు సేకరించి నీటి నాణ్యత పరీక్ష చేశారు. ప్రజలకు మంచినీరు అందిస్తామన్నారు. ఎక్కడైనా పైపులైన్లు లీకులు ఉంటే తక్షణం వాటిని సిబ్బందితో మరమ్మతులు చేయిస్తామన్నారు.

శిథిల వంతెనలు.. ప్రమాదకర ప్రయాణాలు

న్యూస్‌టుడే – గొల్లప్రోలు

నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో పలు రహదారులపై ఉన్న వంతెనలకు రెయిలింగ్, రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. వరద ఉద్ధృతితో కాలువలు నిండుగా ప్రవహించినప్పుడల్లా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

★ గొల్లప్రోలు శివారు ఏలేరు కాలువపై ఉన్న బల్లకట్టు వంతెన రక్షణ గోడలు సరిగాలేవు. గొల్లప్రోలు-పిఠాపురం మధ్య ప్రధాన రహదారిలో ఉన్న ఈ వంతెనపై రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ★ గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే మార్గంలో పంట కాలువపై వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతోపాటు రెండు వైపులా కోతకు గురైంది. ★ చేబ్రోలు నుంచి మల్లవరం వెళ్లే రోడ్డులో పెద్దింటమ్మగుడి సమీపంలో వంతెనకు ఒకవైపు రక్షణగోడ లేదు. ఏలేరు వరద ఉద్ధృతికి ఈ వంతెనపై నుంచి మూడు రోజులపాటు నీరు ప్రవహించింది. ★ కొత్త కాలువపై వంతెనకు రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ★ తాటిపర్తి-వన్నెపూడి మధ్య ఆర్ అండ్ బీ రోడ్డులో వంతెన రెయిలింగ్ విరిగిపోయింది. ★ పిఠాపురం మండలం జములపల్లి, గోకివాడ వెళ్లే రహదారిలో రెండు చోట్ల వంతెనలు శిథిలస్థితిలో ఉన్నాయి. ★ పిఠాపురం నుంచి రాపర్తి వెళ్లే మార్గంలో రక్షణ గోడలు లేని వంతెన ప్రమాదకరంగా ఉంది. ★ కొత్తపల్లి మండలంలో బీచ్‌రోడ్డు మార్గంలో మూడు వంతెనలు శిథిలస్థితికి చేరాయి.


సూరంపేట వెళ్లే మార్గంలో రక్షణగోడ లేక..


గొల్లప్రోలు శివారులో రెయిలింగ్ విరిగిన ఏలేరు బల్లకట్టు వంతెన


చేబ్రోలు-మల్లవరం మధ్య కొత్త కాలువపై ఇలా..

ప్రతిపాదనలు రూపొందించాం..

మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించాం. చేబ్రోలు- మల్లవరం మధ్య కొత్త వంతెన నిర్మించేందుకు రూ. 3.60 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాం.
– ఆశ్రిత, ఏఈ, ర.భ శాఖ

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


గొల్లప్రోలులో బస్టాండు కనకదుర్గ ఆలయం ఎదుట..

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. గొల్లప్రోలులో ఆర్టీసీ బస్టాండు వద్ద శ్రీవిజయ దుర్గ అమ్మవారి ఆలయం ఎదుట విద్యుత్తు దీపాలంకరణలు, దేవతామూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కాజులూరు: దసరా మహోత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల గ్రామాల్లో ఆలయాల వద్ద, ముఖ్యకూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను నిలిపేందుకు కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ఆలయాలను అంగరంగ వైభవంగా రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు.


పెద్దాపురం: ఊరేగింపుగా అమ్మవారు

పెద్దాపురం: స్థానిక వడ్డెవారిపేటలోని భువనేశ్వరీ పీఠం ఆధ్వర్యంలో బుధవారం దుర్గమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు చింతా గోపీశర్మ సిద్ధాంతి, భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మ సేవలో డీఎస్పీ: పెద్దాపురం మరిడమ్మవారిని స్థానిక డీఎస్పీ దంతులూరి శ్రీహరిరాజు కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయం సహాయ కమిషనర్ విజయలక్ష్మి, వేదపండితులు నాగదేవర వేంటకశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాదశర్మ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగు నిలిచి ఇక్కట్లు

సమస్య: గొల్లప్రోలులోని రాయవరం రోడ్డులో ప్రధాన డ్రెయిను పూడిక, వ్యర్థాలు, గుర్రపుడెక్కతో మూసుకుపోయి మురుగు నీరు ప్రవహించడం లేదు. దుర్వాసన, దోమల ఉద్ధృతితో రోగాలు ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి.
– శ్రీనివాస్, గొల్లప్రోలు

సమాధానం: ప్రధాన డ్రెయిన్‌లో పూడిక, వ్యర్థాలు తొలగించే పనులు చేపడతాం.
– రఘుప్రసాద్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, గొల్లప్రోలు

చెత్తతో దుర్వాసన

సమస్య: పెద్దాపురం పట్టణం వారపు సంత నుంచి పద్మనాభ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుండా దుర్వాసన వస్తున్నా చర్యలు తీసుకోవాలి.
– కె.ప్రభాకరరావు, పెద్దాపురం

సమాధానం: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
– కేవీ పద్మావతి, కమిషనర్, పెద్దాపురం

-న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పెద్దాపురం

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

హోరాహోరీగా క్రీడా పోటీలు


చదరంగం ఆడుతున్న విద్యార్థులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మహారాజా రావు మహిపతిరావు 139వ జయంతి సందర్భంగా మహారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య పాఠశాల ఆవరణలో మూడు రోజులపాటు జరిగే అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చెస్, క్యారమ్స్, లాంగ్ జంప్, ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్, త్రోబాల్, షాట్‌పుట్, జావలిన్‌త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయసారథి తెలిపారు. ఆదిత్య సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, బ్లూమింగ్ మైండ్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్, కిండర్ వండర్ ఇన్‌ఛార్జి రేవతి పాల్గొన్నారు.

పిడుగుల శబ్దాలతో భారీ వర్షం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో బుధవారం రాత్రి గొల్లప్రోలులో భారీ వర్షం కురిసింది. భారీ శబ్దాలతో పిడుగులు సమీపంలో పడడంతో ప్రజలు భయాందోళన చెందారు. భారీ వర్షంతో గొల్లప్రోలులోని ప్రధాన రహదారి, వివిధ వీధులు జలమయమయ్యాయి. ఈదురుగాలులతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మండలంలోని గ్రామాల్లోనూ బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది.

ప్రజలకు అందించిన సేవలతోనే గుర్తింపు

కరప, న్యూస్‌టుడే: అంకితభావంతో ప్రజలకు చేసిన సేవలే అధికారులకు గుర్తింపునిస్తాయని జడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు, ఈవోపీఆర్డీ బి.సత్యనారాయణ, ఇతర సిబ్బందిని బుధవారం కరప మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మితో కలిసి ఆయన సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. చింతా ఈశ్వరరావు, వనుం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చాలని వాలంటీర్ల వినతి

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని బుధవారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సీఐటీయు నాయకులు జి.సత్తిబాబు, క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు వాలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. ఆ హామీలను అమలు చేయాలన్నారు. రవి, బంగారయ్య, రమణమ్మ, దివ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రజలు ఉత్సవాల్లో ఉన్న సమయాల్లో అధికంగా చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ఎస్సై ఎన్. రామకృష్ణ కోరారు. బుధవారం గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. గొల్లప్రోలులో, మండలంలోని గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం సాగించారు. దసరా సెలవులకు ఇంటికి తాళాలు వేసి ఇతర ఊళ్లు వెళ్లే వారు పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

అర్ధరాత్రి కారు బీభత్సం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మెయిన్‌రోడ్డు దాసాంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం అర్ధరాత్రి అతివేగంగా కారు నడిపి బీభత్సం సృష్టించారు. వేములవారి సెంటర్ వద్ద బెంగళూరుకు చెందిన ముగ్గురు యువకులు కారులో అతివేగంగా వస్తూ తోపుడు బండిని ఢీకొట్టి బోల్తా పడ్డారు. అర్ధరాత్రి కావడంతో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యువకులు సైతం క్షేమంగా బయటపడ్డారని, దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పింఛను సొమ్ము చోరీ చేసిన యువకుడి అరెస్టు

పిఠాపురం: పిఠాపురం జగ్గయ్య చెరువులో మంగళవారం వృద్ధురాలు అనంత లక్ష్మి వద్ద రూ.4 వేలు పింఛను సొమ్ము చోరీ చేసిన యువకుడు పి.తిమ్మాపురానికి చెందిన జి.పవన్‌గా పట్టణ పోలీసులు గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు.

డీజిల్ తరలిస్తున్న వాహనాలు సీజ్

తాళ్లరేవు: అనుమతులు లేకుండా యానాం నుంచి కాకినాడకు తరలిస్తున్న 7,200 లీటర్ల డీజిల్‌ను, మూడు వాహనాలను కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎంఎస్‌వో లక్ష్మీప్రసన్న, వీఆర్వోలు లంక శ్రీనివాసరావు, వీరబాబు, సత్యనారాయణకు వాటిని అప్పగించారు.

దాడి చేశారని సర్పంచి ఫిర్యాదు

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేటలో డంపింగ్ యార్డు వద్ద గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించే క్రమంలో బుధవారం సర్పంచి సూరాడ చిన్ని వర్గానికి, జనసేన నాయకుల మధ్య వివాదం ఏర్పడింది. జనసేన నాయకులు సోదే ముసలయ్య, సూరాడ శ్రీను పూలమాలలు వేస్తుండగా.. పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం సర్పంచితో ముందుగా దండ వేయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఉన్న తనపై ముసలయ్య, శ్రీను తదితరులు దర్భాషలాడుతూ దాడి చేశారని సర్పంచి చిన్ని తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కాకినాడ సామాన్య ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం


పిఠాపురంలో కార్మికులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

పిఠాపురం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు ముగింపు సందర్భంగా పిఠాపురంలో పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను ఏ విధంగా వేరు చేయాలనే అంశాలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. కమిషనర్ కనకారావు, పారిశుద్ధ్య అధికారులు పాల్గొన్నారు. భాష్యం పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. జనసేన ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, కమిషనర్ టి.రవికుమార్ సన్మానించి యోగ్యతాపత్రాలు అందజేశారు. ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ప్రధాన రహదారిని శుభ్రం చేశారు.

సామర్లకోట: విజయవాడ వరదల సమయంలో, పట్టణంలో మెరుగైన సేవలు అందించిన 15 మంది పురపాలక సంఘ కార్మికులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజెస్ విచ్చేశారు. కరప: స్థానిక సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికులను ఎంపీడీవో కొంకి అప్పారావు బుధవారం సత్కరించారు. ఎంపీపీ పి.శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు వై.వి.సుబ్బారావు, సర్పంచులు ఎస్.ఆశాజ్యోతి పాల్గొన్నారు.


సామర్లకోటలో కార్మికుడికి పురస్కారం అందిస్తున్న ఛైర్‌పర్సన్ అరుణ

పెదపూడి: జి.మామిడాడలో చెత్త సంపద కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికులను మాజీ ఎంపీపీ జుత్తుక సూర్యకుమారి సత్కరించారు. తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధరచౌదరి పెదపూడిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు.


పెద్దాపురంలో ఛైర్‌పర్సన్ తులసీమంగతాయారు


పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ నివాళి


మెర్ల వీరయ్యచౌదరిని సత్కరిస్తున్న కలెక్టర్

మహాత్ముడి బాటలో నడవాలి

న్యూస్‌టుడే బృందం: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. కాకినాడ గ్రామీణం సర్పవరం జంక్షన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 'యంగ్ మైండ్స్' ఛారిటీ సంస్థ ఆధ్వర్యంలో నగర, గ్రామీణ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన, వ్యాస రచన పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే నానాజీ బహుమతులు అందజేశారు. కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో వేళంగికి చెందిన మెర్ల వీరయ్యచౌదరిని కలెక్టర్ షాన్‌మోహన్ శాలువాతో సత్కరించారు. తాళ్లరేవు మండలం చొల్లంగిపేట బాలికల గురుకుల పాఠశాలలో మహాత్మాగాంధీ చిత్రపటానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాకినాడ అర్బన్ వైద్యనగర్‌లోని కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మాజీ మంత్రి కురసాల కన్నబాబు పూలమాల వేశారు. పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాలు, గొల్లప్రోలు నగర పంచాయతీ, కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లో గాంధీ జయంతి నిర్వహించారు.


చొల్లంగిపేటలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు శ్రమదానం

భావనారాయణస్వామి ఆలయ ఆస్తులు కాపాడతాం

సర్పవరం (సర్పవరం జంక్షన్), న్యూస్‌టుడే: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయానికి చెందిన వందల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తెలిపారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు సర్పవరం జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం సర్పవరంలోని భావనారాయణస్వామి ఆలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయానికి పిఠాపురం మహారాజు సుమారు 480 ఎకరాలు దానంగా ఇచ్చారని, సుమారు 80 ఎకరాలు మాత్రమే దేవస్థానం చేతుల్లో ఉందన్నారు. ఎమ్మెల్యేకు అర్చకులు స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవోలు మాచిరాజు లక్ష్మీనారాయణ, జొన్నాడ భీమశంకరరావు పాల్గొన్నారు.


సర్పవరంలో ఎమ్మెల్యే నానాజీ, కూటమి నాయకులు, భక్తులు

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నగర సంకీర్తనలు

పిఠాపురం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంపై పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పిఠాపురంలోని ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో జనసేన శ్రేణులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ బుధవారం సందర్శించి దీక్ష చేస్తున్న వారికి కండువాలు కప్పారు.

గొల్లప్రోలు: టీమ్ జనసేన గొల్లప్రోలు ఆధ్వర్యంలో బుధవారం నగర సంకీర్తన నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన రథంపై వేంకటేశ్వరస్వామి చిత్రపటం ఉంచి డప్పు వాయిద్యాలు, భజన గీతాలు ఆలపిస్తూ ఆర్టీసీ బస్టాండు కనకదుర్గ ఆలయం నుంచి రైల్వే స్టేషన్ సమీపంలోని వెంకన్న ఆలయం వరకు ఊరేగింపు సాగింది.


గొల్లప్రోలులో...

పెదపూడి: ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని అనపర్తి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త రావాడ నాగు అన్నారు. బుధవారం పెదపూడి మండలం పెద్దాడలో సనాతన ధర్మ పరిరక్షణకు నగర సంకీర్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనపర్తి జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసు, అశోక్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పి.మల్లవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జనసైనికులు, భవానీ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జనసైనికుడు వేగి ప్రసాద్ ఆధ్వర్యంలో పి.మల్లవరం, పోలేకుర్రు గ్రామాల్లో నగర సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు గుద్దడి జమ్మి, రమ్య, ప్రకాష్, ధూళిపూడి సుబ్బారావు, సూరంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో జనసేన నాయకులు

ట్రాఫిక్ రద్దీతో ముప్పతిప్పలు


దర్గా సెంటర్‌లో ఒకవైపు నిలిచిన వాహనాలు

పెద్దాపురం: పట్టణంలోని దర్గాసెంటర్, మెయిన్‌రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దర్గాసెంటర్‌లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ట్రాఫిక్ నుంచి బయట పడాలంటే అవస్థలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుదల చేస్తుండటంతో సమస్య జటిలమవుతోంది. రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సులను పాత ఎక్సైజ్ కార్యాలయం ప్రాంతంలో, కాకినాడ వైపు వెళ్లే బస్సులను కూడలి దాటిన తర్వాత నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. కొందరు మైనర్లు ద్విచక్రవాహనాలను ఇష్టానుసారం నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు.



నియంత్రణపై ప్రత్యేక దృష్టి: దర్గాసెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా ఇద్దరు కానిస్టేబుళ్లను ఉంచి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. మైనర్లు వాహనాలు నడపకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వారికి వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటాం. అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.
– మౌనిక, ఎస్సై, పెద్దాపురం


సేకరించిన చెత్తతో పీజీ క్యాంపస్ అధ్యాపకులు, విద్యార్థులు

సముద్ర తీరం.. చెత్త రహితం



తీరంలో ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, తదితరులు



ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో బుధవారం ఐసీడీఎస్ పీడీ ప్రవీణ ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అధికారులు శైలజ, కేఎస్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు. ★ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట సముద్రతీరంలో చెత్త సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పోచయ్య, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు మాగంటి శ్రీదేవి, హరిబాబు, అధ్యాపకులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: సూర్యారావుపేట సముద్ర తీరంలో ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అకడమిక్ డైరెక్టర్ డా.బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ నాగశ్రీకాంత్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సురేఖ, శ్రీనివాస్, వాలంటీర్లు పాల్గొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రౌతులపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రౌతులపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కొళ్ల రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14 (బ్యాడ్మింటన్, కిడ్స్ జావలిన్‌త్రో)లో శ్రీరంరెడ్డి కుశరాజు ప్రథమస్థానం, అండర్-16 లాంగ్ జంప్‌లో బల్లాడి రోహిత్‌రోషన్ ద్వితీయ స్థానం, అండర్ 14 వాలీబాల్‌లో గొరికిపూడి అభినయ్ ప్రతిభ చూపారని వివరించారు.

గ్రామాల్లో సంపదకేంద్రాల పునఃప్రారంభం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో నిర్మించిన సంపదకేంద్రాలను పునఃప్రారంభించారు. కాండ్రేగుల, మామిడాడ, మల్లిసాల, గొల్లలగుంట తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు బొదిరెడ్డి చక్రరావు, కర్రి భవాని, జగతా ఆనందరావు, పంచాయతీ కార్యదర్శులు షకీలా, శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంపదకేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

స్పందనకు వందనం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: చిల్లంగి గ్రామంలోని చింతలతోట ప్రాంతంలో ప్రధాన పైపులైను పగిలిపోవడంతో ఆ ప్రాంత వాసులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. సమస్యను సర్పంచి మహేంద్రాడ శ్రీలత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి బుధవారం ప్రధాన పైపులైనుకు సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066



శృంగవరం సమీపంలో వంతెన దుస్థితి..

రక్షణ లేని వంతెనలు.. తస్మాత్ జాగ్రత్త..!

రౌతులపూడి- శంఖవరం మండలాలను కలిపే ప్రధాన రహదారి ఇది. ఈ మార్గంలో దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనల రెయిలింగ్ (రక్షణ గోడ) లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఎప్పుడు ఏ వంతెన కూలుతుందో తెలియని దుస్థితి. అసలే ఇరుకు రహదారి, ఆపై మలుపుల్లో ఈ వంతెనలు ఉన్నాయి. రౌతులపూడి, బంగారయ్యపేట, శృంగవరం గ్రామాల వద్ద ఉన్న ఈ మార్గంలో వంతెనలను అభివృద్ధి పరచాలని, రహదారిని విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి, వంతెనల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖాధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, రౌతులపూడి



బంగారయ్యపేట వద్ద రెయిలింగ్ లేకుండా..

కడ'గండ్లు' తీరేలా..!

మెరుగైన సాగునీటి వ్యవస్థకు కార్యాచరణ

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

గత నెలలో అధిక వర్షాలు, వరద వల్ల మండలంలోని సాగు వ్యవస్థలు నష్టం వాటిల్లింది. పలుచోట్ల ప్రధాన నీటి మార్గాలకు గండ్లు పడ్డాయి. పంట పొలాలు దెబ్బ తిని పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. గండ్లను పూడ్చేందుకు జలవనరులశాఖ చర్యలు చేపట్టింది. మండలంలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డిసాగర్ మూడు మార్లు పొంగి ప్రవహించింది. ఏలేరు ఎడమ కాలువ సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువకు పి.జగన్నాథపురం, లంపకలోవ, ఉత్తరకంచి, పెదశంకర్లపూడి గ్రామాల్లో ఆరు గండ్లు పడ్డాయి. పెదశంకర్లపూడిలోని కొండల్లో కురిసిన వర్షం ఎర్రకాలువ ద్వారా ప్రవహిస్తుంది. ఈ కాలువకు పడిన భారీ గండి వల్ల సుమారు 100 ఎకరాలు దెబ్బతిన్నాయి. ఈ గండ్లు పూడ్చేందుకు రూ.70 వేలు నుంచి రూ.లక్ష ఖర్చవుతుందని చెప్తున్నారు. ఎర్రకాలువ గండి పూడ్చివేత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నీటి పారుదలకు ఉన్న అవాంతరాలను త్వరితగతిన పరిష్కరిద్దే ఖరీఫ్ ఇబ్బంది లేకుండా చేస్తామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు.



పిల్ల కాలువలకు ఇసుక బస్తాలు వేసిన రైతులు

ఇసుక మేటలతో ఇబ్బంది

గండ్లు పడినచోట, వాగులు ప్రవహించిన పొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. వీటిని తొలగించేందుకు రైతులు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. పెదశంకర్లపూడి, ఏలూరు, ఇలా పలు గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. మేటలు వేసిన పొలాలను సాగుకు అనుకూలంగా మార్చుకునేందుకు రైతులు శ్రమిస్తున్నారు. గండ్లతో పాటు పలుచోట్ల చెరువులు, వాగులు పొంగడం వల్ల పిల్లకాలువలు దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిస్థితి ప్రతి గ్రామంలోనూ ఉంది. దీంతో ఇసుకబస్తాలు వేసుకుని నీటి మార్గాలను పునరుద్ధరిస్తున్నారు. వాగుల వల్ల కోతకు గురైన వ్యవసాయ ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు. సుద్దగెడ్డ వల్ల ప్రత్తిపాడు లంపకలోవ పరిధిలోనూ, గెడ్డ వాగుల వల్ల పోతులూరు, ఒమ్మంగి పరిసర ప్రాంతాల్లోనూ ఈ పరిస్థితి ఉంది.



పెదశంకర్లపూడి ఎర్రకాలువ గండి పూడ్చివేత పనులు

ఉప్పలపాడులో తూతూమంత్రంగా గ్రామసభ

గండేపల్లి: ఉప్పలపాడు గ్రామంలో గ్రామసభ సక్రమంగా జరగలేదని జనసేన నాయకుడు మేడిబోయిన శ్రీను అన్నారు. బుధవారం గ్రామంలో 10 గంటలకు ప్రారంభం కావాల్సిన గ్రామసభ సుమారు 11 గంటలు అయినా ప్రారంభం కాలేదని ఆరోపించారు. సర్పంచి సభకు హాజరుకాకపోగా ఉపాధి కూలీలతో గ్రామ సభను నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలేకుండా సభను తూతూమంత్రంగా ముగించారని ఆరోపించారు. గ్రామసభ ఉద్దేశించి పంచాయతీ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ.. ముందురోజు గ్రామంలో అందరికి తెలియజేశామని, పనులపై చర్చించామన్నారు.

జగ్గంపేట గ్రామీణం: మండల పరిధిలో అన్ని గ్రామాల్లో బుధవారం సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్ తయారుచేసి పనులను గుర్తించి విధంగా తీర్మానం చేశామని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వారం రోజులపాటు గ్రామసభలు నిర్వహిస్తామని వివిధ పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే వారు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

న్యూస్‌టుడే బృందం: ఏలేశ్వరంలోని మూడో వార్డులో జేబీఆర్ ట్రస్ట్ ఛైర్మన్ జ్యోతుల వీర్రాజు, మాజీ కౌన్సిలర్ వీర్రా మమమ్మ ఆధ్వర్యంలో మూడో వార్డు లింగవరం కాలనీ వద్ద నేటినుంచి దసరా ఉత్సవాలు అట్టహాసంగా జరుగనున్నాయి. పట్టణంలోని సంతోషిమాత ఆలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ✦ జగపతినగరంలోని అభయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కిర్లంపూడిలోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు హోమాలు, పూజలు నిర్వహించనున్నారు.



తపోవనం ఆశ్రమంలో.. స్వామీజీ



ఏలేశ్వరం లింగవరం ఉత్సవ ఏర్పాట్లు

✦ తొండంగి మండలం రావికంపాడు నెల రోజుల పాటు గ్రామ సంకీర్తన నేటినుంచి ప్రారంభమైంది. సీతా రాములను పల్లకిలో ఊరేగించారు. ✦ అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హోమం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.



జగపతినగరంలోని అభయదుర్గాదేవి

నేడు లోవ దేవస్థానంలో..

తుని గ్రామీణం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల వేడుకలను మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఉ.10 గంటలకు ప్రారంభించనున్నట్లు తేటగుంట పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ✦ కుమ్మరిలోవ తపోవనంలో ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ దసరా ఉత్సవాలకు బుధవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

తుని పట్టణం: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు 3 నుంచి 14 వరకూ జరుగుతాయని ఈవో ఎస్.అయ్యపరాజు తెలిపారు. విజయదశమి రోజున పంచామృత అభిషేకం పూజలు జరుగుతాయన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తదితరులు

ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, న్యూస్‌టుడే: జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రి నూతన కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం సీహెచ్‌సీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. ప్రతీ సామాన్యుడికి మెరుగైన వైద్యం అందాలన్నారు. ఆసుపత్రిలో ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కమిటీ మెంబర్లుగా బొడ్డేటి సుమన్, నకిరెడ్డి సూర్యవతి, మానేపల్లి బంగారాజు, ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు. అనంతరం జడ్.రాగంపేట శివారున నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే పరిశీలించారు.

పింఛను సొమ్ము చోరీ చేసిన యువకుడి అరెస్టు

పిఠాపురం: పిఠాపురం జగ్గయ్య చెరువులో మంగళవారం వృద్ధురాలు అనంతలక్ష్మి వద్ద రూ.4 వేలు పింఛను సొమ్ము చోరీ చేసిన యువకుడు పి.తిమ్మాపురానికి చెందిన జి.పవన్‌గా పట్టణ పోలీసులు గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు.

పారదర్శకంగా ఉపాధి పథకం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఉపాధి పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేసి కనీస వేతనాలు అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్)లిబరేషన్, వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయార్లా) శ్రేణులు పోతులూరులో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయం ముందు ధర్నా చేశారు. 'ఉపాధి హామీ' పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని సర్పంచి రాంబాబుకు అందజేశారు. లిబరేషన్, అయార్లా నాయకులు మానుకొండ లత్సబాబు, సుబ్బారావు, అర్జునుడు తదితరులు నాయకత్వం వహించారు.

పవన్ కల్యాణ్‌కు మద్దతుగా మోకాళ్లపై దీక్ష

కిర్లంపూడి, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని సోమవరంలో వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం ఉపవాసదీక్షలు నిర్వహించారు. అనంతరం భక్తులకు విష్ణుసహస్రనామం పుస్తకాలను భక్తులకు అందజేశారు. రాయుడు శ్రీను, రాంబాబు, బాబీ, శ్రీనివాస్, రాజు, మణికంఠ, సూరిబాబు, భవానీ భక్తులు పాల్గొన్నారు.



సోమవరంలో దీక్ష చేస్తున్న రమేష్ తదితరులు

వ్యర్థాల నిర్వహణతోనే పంచాయతీలకు ఆదాయం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. తిరుమాలిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహించుకుంటే పంచాయతీలకు దండిగా ఆదాయం సమకూరుతుందన్నారు. సర్పంచి సూతి కృష్ణప్రసాద్, ఈవోపీఆర్డీ కేవీ సూర్యనారాయణ, నాయకులు సూతి బూరయ్య, పాల్గొన్నారు. అనంతరం ప్లాస్టిక్ బుట్టలను స్థానికులకు అందజేశారు.



తిరుమాలిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బుజ్జి

సబ్‌జైలులో న్యాయ అవగాహన సదస్సు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని ఉప కారాగారంలో గాంధీ జయంతి సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించింది. జైలు సూపరింటెండెంట్ ఎస్.బాబుతో కలిసి కమిటీ న్యాయవాదులు బుగత శివ, బొంగుళూరి మధుబాబు, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి గాంధీజీకి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో ఖైదీల హక్కులపై న్యాయవాదులు అవగాహన కలిగించారు. నేరాన్ని తప్ప నేరస్థుణ్ని ద్వేషించకూడదన్నారు. జైలులో ఉన్న కాలాన్ని పరివర్తనకు, రుజుమార్గానికి బాటగా మలచుకోవాలని సూచించారు. ఖైదీలకు పండ్లు తదితర ఆహార వస్తువులు అందజేశారు.



మాట్లాడుతున్న న్యాయవాది శివ, సూపరింటెండెంట్ బాబు

అర్ధరాత్రి కారు బీభత్సం

పెద్దాపురం: పెద్దాపురం మెయిన్‌రోడ్డు దాసాంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం అర్ధరాత్రి అతివేగంగా కారు నడిపి బీభత్సం సృష్టించారు. వేములవారి సెంటర్ వద్ద బెంగళూరుకు చెందిన ముగ్గురు యువకులు కారులో అతివేగంగా వస్తూ తోపుడు బండిని ఢీకొట్టి బోల్తా పడ్డారు. అర్ధరాత్రి కావడంతో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. యువకులు సైతం క్షేమంగా బయటపడ్డారని, దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. వివరాలివీ..తాళ్లూరుకి చెందిన పక్కుర్తి వీరబాబు(53) గత నెల 30న కూలీపనికి వెళ్లి వచ్చి ఇంటి మెట్టుపై కూర్చోగా మూర్ఛ వచ్చి జారిపడ్డాడు. అప్పటినుంచి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వీరబాబు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

బాపు చూపిన బాటలో నడుద్దాం

న్యూస్‌టుడే బృందం: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో పయనిద్దామని ఎమ్మెల్సీ, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. పట్టణంలోని గాంధీసత్రం ఆవరణలో ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. ● ప్రత్తిపాడులోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పూలమాల వేసి నివాళులర్పించారు. ● మహాత్ముని సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట తెదేపా కార్యాలయంలోనూ, ఆర్యవైశ్య కల్యాణమండపంలోనూ గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలదండలు వేసి నివాళులు అర్పించారు. జగ్గంపేట తహసీల్దారు కార్యాలయం వద్ద జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ బాపు విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. ● ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహుదూర్‌శాస్త్రి చిత్రపటాలకు కమిషనర్ ఎం.సత్యనారాయణ, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపాల కృష్ణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు శిడగం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ వై.నాగబాబు పాల్గొన్నారు. తుని పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కమిషనర్ ఎ.వెంకట్రావు గాంధీజీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. దివాణం వీధిలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్, ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఎస్.స్వప్న నివాళి అర్పించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, ఇతర నాయకులు మెయిన్‌రోడ్డులో గాంధీజీ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించి, ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.



తునిలో గాంధీజీకి నివాళి అర్పిస్తున్న యనమల



ప్రత్తిపాడులో.. ఎమ్మెల్యే సత్యప్రభ

గందరగోళంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

● రూ.1.66 లక్షల రికవరీకి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట లక్ష్మీ

శంఖవరం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో నరేగా సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం జరిగింది. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఎంపీపీ పర్వత గుర్రాజు, ఏపీడీ జగదాంబ, ఎంపీడీవో శివరామకృష్ణయ్య తదితరులు కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై ఇప్పటికే గ్రామ స్థాయిలో తనిఖీలు జరిగాయి. అనంతరం మండల స్థాయిలో జరిగిన ప్రజా వేదికలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు క్షేత్రసహాయకులు రాజీనామా చేయడంపై వాగ్వాదం చోటుచేసుకుంది. గతంలో జరిగిన పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జరిగిన పనులకు సంబంధించి రూ.1.66 లక్షల రికవరీకి, ఎస్.జగ్గంపేట క్షేత్ర సహాయకుడు సస్పెన్షన్‌కు ఆదేశించామని పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. రూ.9 వేల అపరాధ రుసుం వసూలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చామని పీడీ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ సింహాద్రి, తెదేపా నేతలు పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ముగింపు

అన్నవరం, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ముగింపులో భాగంగా అన్నవరం దేవస్థానంలో బుధవారం మొక్కలు నాటారు. సెప్టెంబరు 17 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహించారు. సత్య, రత్నగిరులపై పరిశుభ్రత, వసతి సముదాయాలు, కల్యాణ మండపాలు, ఇతర భవనాలపై మట్టి, చెత్త శుభ్రం చేయడం, తుప్పలు తొలగింపు, రహదారుల పరిశుభ్రత తదితర కార్యక్రమాలు చేపట్టారు. గాంధీజయంతి సందర్భంగా కార్యక్రమం చివరిరోజు సత్యగిరిపై ఛైర్మన్ ఐ.వి. రోహిత్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఛైర్మన్ ఐ.వి.రోహిత్

నిరుపయోగంగా వైద్య పరికరాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యకేంద్రాల భవనాలు పూర్తికాకుండానే గత ప్రభుత్వం వాటికి సంబంధించిన వైద్యపరికరాలు, ఫర్నిచర్ తదితర వాటిని పెద్ద ఎత్తున ప్రతి గ్రామానికి సరఫరా చేయడంతో గత రెండేళ్లుగా మూలకు చేరి నిరుపయోగంగా పడి ఉన్నాయి. భవనాలు పూర్తికాకపోవడంతో వాటిని ఉపయోగించిన దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో డి.పోలవరం, కుమ్మరిలోవ, ఎన్ఎస్వీ నగరం, దొండవాక తదితర గ్రామాల్లో లక్షలు విలువ చేసే వైద్య పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. – తుని గ్రామీణం



శిథిల ట్యాంకుతో పొంచిఉన్న ప్రమాదం

ఎ.కొత్తపల్లి ప్రధాన రహదారి పక్కన తాగునీటి ట్యాంకు శిథిలమై నిరుపయోగంగా మారింది. తాగు నీటిని అందించే ట్యాంకును ఏడాది క్రితం ఓ లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ట్యాంకుకు పెద్ద రంధ్రం ఏర్పడి పక్కకు ఒరిగిపోయింది. అప్పటి నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉందని, అధికారులు స్పందించి తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తొండంగి



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

❖ వాడవాడలా 'స్వచ్ఛతా హీ సేవ'

న్యూస్‌టుడే బృందం: తుని పట్టణాన్ని ఆరోగ్యవంతం, సుందరంగా తీర్చిదిద్దడానికి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిద్దామని పురపాలక ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కమిషనర్ ఎ.వెంకట్రావు అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్యాలయంలో కార్మికులను సన్మానించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ● ఏలేశ్వరం కేంద్రంగా పనిచేస్తున్న ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పట్టణంలోని 20వ వార్డు చైతన్య నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం ప్రముఖ వైద్యులు సఖిరెడ్డి విజయబాబు మొక్కలు నాటారు. అనంతరం స్థానికులకు ఉచితంగా మొక్కలను అందజేశారు. సంఘ నాయకులు కర్రోతు సత్యనారాయణ, అనసూరి నాగేశ్వరరావు, రౌతు సహదేవుడు తదితరులు పాల్గొన్నారు. ● కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో టోల్‌ప్లాజా వద్ద భాజపా మండల పార్టీ అధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులు, టోల్‌ప్లాజా సిబ్బంది జాతీయ రహదారిని శుభ్రం చేశారు. తామరాడ గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు గోకాడ దుర్గానాగేంద్రకుమార్ రాజా పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రంచేసి, డ్రైన్‌ల్లో పూడిక తొలగించారు. ● సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల డిప్యూటీ ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సూరంపాలెం పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించినట్లు పవర్‌గ్రిడ్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు.



ఏలేశ్వరంలో మొక్కలు అందిస్తున్న డాక్టర్ విజయబాబు.



కృష్ణవరంలో టోల్‌ప్లాజా వద్ద ఎన్‌హెచ్‌ని శుభ్రం చేస్తున్న నాయకులు, టోల్‌ప్లాజా సిబ్బంది



తునిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్, కమిషనర్